క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో ... టమాట 25, పచ్చిమిర్చి 50 , బెండ 35, కాకర 35, దొండ 30, దోస 40, ఆలు 25, చామ 45, కీర 25, బీర 35, వంకాయ 30, గోకర 40, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 25, క్యారెట్ 55, చిక్కుడు 50, ఉల్లి 30 (1 కేజీ), ములక్కాయలు (2) 10, క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 150, వెల్లుల్లి 150.

సంకీర్తన శ్రవణం



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం సంకీర్తన శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నమయ్య స్వరార్చనలో భాగంగా కుమారిసిరి స్పందన గజవదన బెడువే, నారాయణతే నమో, ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన, గోవింద గోవింద అంటూ కీర్తనలను ఆలపించి సందర్శకులను అలరించారు. కీబోర్డు శాస్త్రీ, తబల అజయ్, వాయిద్య సహకారం అందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మాదాపూర్: డేటాసైన్స్, వెబ్ డెవలప్‌మెంట్ రంగాల్లో వినూత్న ఆవిష్కరణలపై చర్చించడం వల్ల మరిన్ని విజయాలను సాధించవచ్చని ఓడిన్ స్కూల్ సీఈఓ విజయ్ పసుపులేటి అన్నారు. మాదాపూర్‌లోని లెమన్‌ట్రీ హోటల్‌లో శనివారం ఓడిన్ స్కూల్ అలుమ్నీ సక్సెస్‌మీట్–2023ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సక్సెస్‌మీట్‌లో వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారు తమ అనుభవాలను తెలిపారన్నారు. కార్యక్రమంలో ఓడిన్ స్కూల్ పూర్వ విద్యార్థులు, లీడర్‌షిప్ కెరీర్ కోచ్ విక్రమ్ దుగ్గల్, హెచ్‌ఆర్ కన్సల్టెంట్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునిగా పల్లె అనంతరెడ్డి



గచ్చిబౌలి: కొండాపూర్ జెడ్పీహెచ్ఎస్ ఇంచార్జీ హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్) పల్లె అనంతరెడ్డికి ఉత్తమ ఉపాధ్యాయునిగా రాష్ట్ర స్థాయి అవార్డ్ దక్కింది. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డులలో అనంతరెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. దశాబ్దకాలంగా దాతల సహకారంతో స్కూల్‌లో మౌలిక వసతులు, నాణ్యమై విద్యకు ఆయన కృషి చేశారు. డిజిటల్ బోర్డులు, గ్రీన్ బోర్డులు, లైబ్రరీ, 8 తరగతి గదులు నిర్మాణం, టాయిలెట్ల నిర్మాణం చేపట్టారు. దాదాపు దాతల ద్వారా రూ.2 కోట్ల రూపాయలతో వసతుల కల్పన చేసినట్లు అనంతరెడ్డి పేర్కొన్నారు. అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు.

బస్తీ దర్శన్..



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పుష్ప నగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని 5వ బ్లాక్ లో శనివారం బస్తీ దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప నగేష్ అధికారులతో కలిసి పాల్గొన్నారు. కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆమె మాట్లాడుతూ బస్తీ వాసులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, యాదయ్య, బాలరాజు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

హఫీజ్‌పేట్ : సందయ్య మెమోరియల్ ట్రస్ట్ పేదలకు అండగా ఉంటుందని ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ పేర్కొన్నారు. శనివారం చందానగర్ పాపిరెడ్డి కాలనీలోని హనుమాన్ ఆలయం వద్ద ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటి సమస్యలు ఉండి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి సందయ్య మెమోరియల్ ట్రస్ట్ అండగా ఉందన్నారు.కార్యక్రమంలో ముత్యాల రమేష్, నరసింహ, సంజీవరెడ్డి, బీరప్ప, విజయ్‌కుమార్, రాజేష్, రాజు యాదవ్, నందగోపాల్ పాల్గొన్నారు.



శిబిరంలో కళ్లద్దాలను అందజేస్తున్న భిక్షపతి యాదవ్

సైబర్..అలర్ట్

- ఫ్లెక్సీల ద్వారా అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- సైబర్ నేరాలపై 1930కి కాల్ చేయండి

గచ్చిబౌలి: సైబర్ నేరాలు ఊహించని విధంగా జరుగుతున్నాయి. స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్ వాడకంతో చదువుకున్న వారే నిండా మునుగుతున్నారు. పెట్టుబడి పెడితే రెట్టింపు వస్తుందంటే నమ్మి మోసపోయే వారు కొందరు. ఉద్యోగాల పేరిట, కెవైసీ, క్యూ ఆర్‌కోడ్, ఇన్సూరెన్స్, ఓటీపీ, న్యూడ్ కాల్స్ ఇలా నేరగాళ్లు ఎన్నోరకాల సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని 1930కు కాల్ చేయాలని సైబరాబాద్ పోలీసులు సూచిస్తున్నారు. నిత్యం సైబర్ నేరాలు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 5ఎస్, 17 వర్టికల్స్ అమలులో సైబరాబాద్ కమిషనరేట్‌లో మోడల్ పోలీస్‌స్టేషన్‌గా గుర్తింపు పొందిన రాయదుర్గం పోలీసులు వినూత్నరీతిలో నేరాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఫ్లెక్సీల ద్వారా వివిధ నేరాలు, సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పిస్తున్నారు. పీఎస్‌కు వచ్చే వారే కాకుండా రాకపోకలు సాగించే వాహనదారుల్లోనూ కొంత మార్పు వస్తుందని పోలీసులు ఆశిస్తున్నారు.

- యువత డ్రగ్స్‌కు బానిసలు కారాదంటూ.. చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు.. చైన్‌స్నాచర్లు, పిక్ ప్యాకెటర్లు, మొబైల్ చోరీలు.. హ్యూమన్ ట్రాఫికింగ్.. కాలేజీలలో ర్యాగింగ్.. మద్యం తాగి డ్రైవింగ్..బాల కార్మిక వ్యవస్థ.. షీ టీమ్స్ తదితరాలపై ఫ్లెక్సీలతో అవగాహన కల్పిస్తూన్నారు.
- హ్యూమన్ ట్రాఫికింగ్ సమాచారం తెలిస్తే 944 0700858 సమాచారం ఇవ్వాలని ,అలాగే ఇతర రాష్ట్రాలు, దేశాలకు మహిళలను అక్రమ రవాణా చేస్తే 1-888-373-7888 కాల్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు.



వివిధ నేరాలపై అవగాహన కల్పించేందుకు రాయదుర్గం పోలీస్ స్టేషన్ ప్రహరీ వెంట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు









మార్పు అవసరం..



మన చుట్టూ ఎన్నో నేరాలు జరుగుతున్నా మనకు అవసరం లేదనుకుంటాం. ఏదో ఒకరోజు మీరూ బాధితులు కావచ్చు. వివిధ రకాల నేరాలపై అవగాహన అవసరం. రోజుకో సైబర్ క్రైం కేసు నమోదవుతుందంటే... చదువుకున్న వాళ్లు చేస్తున్న పొరపాటు, నిర్లక్ష్యం. అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి నేరం చోటు చేసుకున్నా బాధితులు డయల్ 100తో పాటు పీఎస్‌కు సమాచారం ఇవ్వాలి. మీ చుట్టూ ఎన్నో రకాల మోసాలు మాటువేసి ఉన్నాయని అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాం.

– మహేష్, ఎస్‌హెచ్‌ఓ, రాయదుర్గం

అలరించిన నృత్య ప్రదర్శనలు



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం బెంగుళూరుకు చెందిన కళాకారిణి రజితకృష్ణ భరతనాట్య ప్రదర్శనతో అలరించింది. ఇందులో మహదేవ సుతం, రామాయణశబ్దం, ఓ భామపదం, తిల్లాన అంశాలను ప్రదర్శించారు. అలాగే మయూరి కూచిపూడి నృత్యాలయ గురువు శ్రీదేవి శిష్యబృందం గణేశ పంచరత్న, శరణుసిద్ధి, కూచిపూడి సలాం, కృష్ణశబ్దం తదితర అంశాలను కళాకారులు నందిత, పల్లవి, అర్చన, మనస్విని, సహస్ర, అశ్రిత, సంయుక్త, విరూప, లౌక్య, దీక్షిత, కార్తీక ప్రదర్శించారు.

అందుబాటులో ఓటరు జాబితా



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో శనివారం ఓటరు జాబితాలను అందుబాటులో ఉంచారు. ఓటరు జాబితా స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా ఓటరు జాబితా డ్రాఫ్ట్ రోల్, ఫారం-6, ఫారం-8లను అందుబాటులో ఉంచారు. జాబితాలో తప్పులు, నియోజకవర్గ పరిధిలో చిరునామా మార్పునకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అక్టోబర్ 1 తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బలం, బలగం

రాష్ట్ర నాయకులు రఘునాథ్‌యాదవ్

రాయదుర్గం: అభివృద్ధి చేస్తామని మాటిస్తే టీఆర్ఎస్ పార్టీకి రెండుసార్లు అవకాశం ఇచ్చామని, అభివృద్ధిని విస్మరించిన ఆ పార్టీపై ఈసారి తిరగబడాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రఘునాథ్‌యాదవ్ పేర్కొన్నారు. నానక్‌రాంగూడలో 10వ రోజు శనివారం గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని జేబీఎంకాలనీ, రజకనగర్, ముదిరాజ్‌బస్తీ, లోధీబస్తీ, కుమ్మరివాడ, పుకట్‌బస్తీలలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బలం, బలగమన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని మరోసారి స్వాగతించేందుకు ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఈశ్వర్, ముత్యంరెడ్డి, నర్సింహగౌడ్, గఫూర్, రాములుగౌడ్, మునవర్‌పాషా, సహదేవ్, నరేష్‌రాజు, సంజీవరెడ్డి, కుమార్, చిన్ననర్సింహ, ఫిరోజ్, మునీర్, వినోద్ పాల్గొన్నారు.



నానక్‌రాంగూడలో పర్యటిస్తున్న నాయకులు రఘునాథ్‌యాదవ్



వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న శేరిలింగంపల్లి కాంగ్రెస్ నాయకులు

మహానేత వైఎస్సార్

గచ్చిబౌలి: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్‌రాజశేఖర్ రెడ్డి మా గుండెల్లో ఎప్పటికీ పదిలంగా ఉంటారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు రఘునాథ్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం కొండాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వ్యవసాయాన్ని పండుగ చేసి రైతన్న ముఖంపై చిరునవ్వులు నింపిన మహనీయుడు వైఎస్సార్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఈశ్వర్, ముత్యం రెడ్డి, నర్సింహులు గౌడ్, గఫూర్, రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెల్లాపూర్‌లో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని శనివారం తెల్లాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేదల కోసం పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి వారి బంగారు భవిష్యత్తును ఆయన బాట వేశారని తెలిపారు. తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రవీందర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శేరిలింగంపల్లిలో బీజేపీ జెండా ఎగరవేస్తాం



సమావేశంలో కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు, స్థానిక నాయకులు

కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు

హఫీజ్‌పేట్ : రానున్న ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరవేస్తామని కర్ణాటక రాజరాజేశ్వరినగర్ ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా శనివారం మదీనాగూడ సత్యనారాయణ ఎన్‌క్లేవ్‌లో నియోజకవర్గం పార్టీ ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో బీజేపీ ఓట్లు 70వేలు ఉన్నాయన్నారు. బీజేపీ నాయకులందరి కలిసికట్టుగా పని చేస్తే గెలుపు తథ్యం అని పేర్కొన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై వ్యతిరేకత ఉందన్నారు. 20 రోజుల్లో బీజేపీ నాయకులతో కలిసి బైక్ ర్యాలీలు, రోడ్ షోలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్, మొవ్వ సత్యనారాయణ, నాయకులు నరేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు ప్రభాకర్, నాగుల్ గౌడ్, ఫణి భూషణ్, హరి ప్రసాద్, నియోజకవర్గం కన్వీనర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అందరు కలిసి నడిస్తేనే గెలుపు

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నాయకుల తీరు ఎవరికి వారే అన్న తీరుగా ఎమ్మెల్యే అభ్యర్థిగా యాత్రలు చేస్తున్నారని, కనీసం డివిజన్‌లో బూత్ స్థాయి నాయకులను గుర్తించే స్థాయిలో ప్రధాన నాయకుడు లేడన్నారు. నాయకులలో మార్పు రావాలని, అందరు బీజేపీ నాయకులే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. శక్తి కేంద్రాలు సరిగ్గా లేవని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎవరికి టికెట్ ఇవ్వాలో అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు.

మంత్రి హరీష్‌రావుకు వినతి

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర హోంగార్డుల సమస్యలపై మంత్రి హరీష్‌రావుకు వినతి పత్రాన్ని అందించామని సైబరాబాద్ హోంగార్డుల సంఘం అధ్యక్షుడు అశోక్‌కుమార్ శనివారం తెలిపారు. హోంగార్డులను పర్మినెంట్ చేయాలని కోరామన్నారు. గతంలో ఉద్యమ సమయంలో హామీ ఇచ్చారని తెలిపారు. పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హోంగార్డుల సంఘం ప్రతినిధులు తాహెర్ మహ్మద్, రావు మహేందర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంధ్య టెక్నోవన్‌లో 40 శాతం కార్యకలాపాలు

గచ్చిబౌలి: సంధ్య టెక్నోవన్‌లో స్థలం కొనుగోలు చేసిన వారంతా ఒకతాటి పైకి వచ్చి పనులు పూర్తి చేసుకుంటున్నామని యజమానులు స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో ప్రస్తుతం 40 శాతం కార్యకలాపాలు కొనసాగుతున్నాయని, పలు సంస్థలు కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయని వారు వివరించారు. టెక్నోవన్‌లో స్థలాలు కొనుగోలు చేసిన యజమానులు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంధ్య టెక్నోవన్ మీద గతకొన్ని రోజులుగా వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, కొనుగోలుదారుల ఆధ్వర్యంలోనే నిర్మాణ పనులన్నింటినీ పూర్తి చేసుకున్నామన్నారు. సమావేశంలో భవన నిర్మాణ సమన్వయకర్త కమాండర్ హరీష్ నాయని, కొనుగోలుదారులు నిరంజన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం ఐనోల్ గ్రామంలో ఏషియన్ పెయింట్స్ వారి సహకారంతో హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ ప్రతినిధి సాంబరాజు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. శిబిరంలో పాల్గొన్న ప్రజలకు మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధి నందమూరినగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం అర్థరాత్రి కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే నిజాంపేట రోడ్డు రాఘవరెడ్డి ఫంక్షన్ హాలు వద్ద మంజీర పైపులైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ఎక్కడ నీటి సమస్య తలెత్తకుండా కిందిస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ వాసులు నాగవరప్రసాద్, అంజయ్య, కోటిరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లైవ్ వెల్ మారథాన్

కూకట్‌పల్లి: హైదర్‌నగర్‌లో శనివారం చిన్నారులు , తల్లిదండ్రులతో కలిసి లైవ్‌వెల్ మారథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా లైవ్ వెల్ రిహబిలిటేషన్ నెట్‌వర్కు నిర్వాహకులు మాట్లాడుతూ ప్రస్తుతం చిన్నపిల్లల్లో వస్తున్న మానసిక రుగ్మతలను పారదోలేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు కూడా పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని, తమ హాస్పిటల్‌లో ఆటిజం పిల్లలకు వైద్యం అందిస్తున్నామని, వారు కూడా మిగిలిన పిల్లల కంటే తక్కువ కాదని నిరూపించేందుకు మారథాన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు లైవ్‌వెల్ రిహబిలిటేషన్ నెట్‌వర్కు నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం



భూమి పూజలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామంలో శనివారం నూతనంగా నిర్మించతలబెట్టిన మల్లన్న స్వామి, బీరప్ప స్వామి ఆలయాల భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ ఆలయాల నిర్మాణాలకు మొదటి విడతగా 10 లక్షల రూపాయల విరాళం అందించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు సొంత నిధులతో 180కి పైగా దేవాలయాలు, 100కు పైగా మసీదులు, చర్చిలు నిర్మించామని తెలిపారు. ఒగ్గు కళాకారులు, డప్పు వాయిద్యాలు, బోనాలతో జీఎంఆర్‌కు గ్రామస్తులు ఆత్మీయ స్వాగతం పలికారు .అనంతరం గ్రామంలోని తెలంగాణ తల్లి విగ్రహం, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ రాజ్‌కుమార్, ఎంపీటీసీ వెంకట్ రెడ్డి, చిన్నకంజర్ల సర్పంచ్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, ఉపసర్పంచ్ హరిశంకర్ గౌడ్, గోపాల్‌రెడ్డి, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలోచించి ఓటు వేయండి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్ : బీజేపీ జెండా ఎగిరే వరకు ప్రతి నాయకుడు కష్టపడాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం చందానగర్ డివిజన్ పరిధిలోని రాజేందర్‌రెడ్డినగర్, సత్య ఎన్‌క్లేవ్, శుభోదయ కాలనీ, సురక్ష హిల్స్, కాలనీలలో గడపగడపకు రవన్న ప్రజాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతులు, మేధావులు, ఐటీ నిపుణులు ఒకసారి ఆలోచించి ఓటు వేయాలన్నారు. రామరాజ్య స్థాపనకు కృషి చేస్తున్న బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ ప్రజాయాత్రలో జిల్లా నాయకులు బుచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్ నవతా రెడ్డి, నాయకులు సింధురెడ్డి, రాంరెడ్డి, రాజు గౌడ్, నర్సింహారెడ్డి, మన్నె దత్తు, రఘునాథ్‌రెడ్డి, వెంకట బాలపతి, సైఫుల్లా ఖాన్, శ్రీనివాస్, రాకేష్ దూబే తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న రవికుమార్ యాదవ్

కాలనీలు, బస్తీల అభివృద్ధికి కృషి

కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: కాలనీలు, బస్తీల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. డివిజన్ పరిధిలోని లింగంపల్లి, బృందావన్ కాలనీలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ పనుల నాణ్యత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షులు గడ్డం రవియాదవ్, నాయకులు లక్ష్మణ్ యాదవ్, సుభాష్‌రాథోడ్, రవి, రాకేష్, సాయికుమార్, సాయి, శరణ్‌కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్‌నగర్, మొగులమ్మ కాలనీ, రాజీవ్‌గాంధీ నగర్ కాలనీల్లో జీహెచ్‌యంసీ అధికారులు, స్థానికులతో కలిసి శనివారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాదయాత్ర చేపట్టారు. ఇంటింటికి వెళ్లి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కాలనీల్లో పారిశుధ్య సమస్య ఎక్కువగా ఉందని, చెత్తా చెదారాన్ని బహిరంగ ప్రదేశంలో పడవేయకుండా ఉదయం వచ్చే ఆటో రిక్షా కార్మికులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ చేసిన అభివృద్ధి పనుల కరపత్రాన్ని ఇంటింటికీ అందించారు. కార్యక్రమంలో అధికారులతో పాటు యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, నాయకులు కాశీనాద్ యాదవ్, గుడ్ల శ్రీనివాస్, శివరాజ్‌గౌడ్, కె. శ్రీనివాస్, జనార్ధన్, సంగమేష్, బాలస్వామి, సీహెచ్. భాస్కర్, సంతోష్, రాజ్యలక్ష్మీ, మధులత తదితరులు పాల్గొన్నారు.